


EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
శనివారం
25-10-2025
పేజీలు: 02



కర్నూల్ బస్సు ప్రమాదంలో బైటపడ్డ

## మరో సంచలన విషయం

బస్సు లగేజ్ విభాగంలో ఉంచిన 234 కొత్త మొబైల్ ఫోన్లు మంటలను మరింతగా పెంచాయని తెలిపిన అధికారులు. హైదరాబాద్‌కు చెందిన మంగనాథ్ అనే వ్యాపారి రూ.46లక్షలు విలువైన రియల్‌మీ కంపెనీ సెల్‌ఫోన్ల బాక్సులను బస్సులో పార్సిల్ చేయగా.. అవి బెంగళూరులోని ఫ్లిప్‌కార్టుకు చేరాల్సి ఉంది. కాగా.. ప్రమాదంలో మంటల తీవ్రత పెరగడానికి ఈ సెల్‌ఫోన్ల బ్యాటరీలు పేలిపోవడం కూడా ఓ కారణమేనని తెలిపిన ఫోరెన్సిక్ నిపుణులు, మంటలకు ఆ ఫోన్లు కాలిపోవడంతో బ్యాటరీలు పేలిపోయిన శబ్దం వచ్చిందని తెలిపిన ప్రత్యక్ష సాక్షులు. మొబైల్ ఫోన్ల పేలుళ్లు మాత్రమే కాకుండా, బస్సులో ఏసీ వ్యవస్థకు అమర్చిన విద్యుత్ బ్యాటరీలు కూడా పేలిపోయాయని తెలిపిన ఏపీ అగ్నిమాపక సేవల విభాగం డైరెక్టర్ జనరల్ పి. వెంకటరమణ.



క్షమించండి..

## కవిత భావోద్వేగం

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత భావోద్వేగానికి లోనయ్యారు. తెలంగాణ రాష్ట్రం కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ అమరుల స్థూపానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉద్యమకారుల కోసం పోరాడలేకపోయామని, అమరవీరుల కుటుంబాలకు అనుకున్నంత న్యాయం చేయలేకపోయామని భావోద్వేగానికి లోనయ్యారు. ఉద్యమకారులకు న్యాయం జరిగేవరకు పోరాడనందుకు బహిరంగ క్షమాపణ చెప్పారు.కాగా, కవిత నేటి నుంచి 'జాగృతి జనం బాట' కార్యక్రమం నిర్వహించనున్నారు. వరుసగా 4 నెలలపాటు ప్రజలతో ఉండేలా కార్యక్రమాలు చేపట్టనున్నారు. భవిష్యత్ కార్యాచరణలో భాగంగా ప్రజల నుంచి సలహాలు, సూచనలు తీసుకోనున్నారు. నిజామాబాద్‌కు నుంచి జనంబాట కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ప్రజలు కోరుకుంటే కొత్త పార్టీని పెట్టేందుకు కూడా సిద్ధమని కవిత ఇప్పటికే స్పష్టం చేసిన సంగతి తెలిసిందే.



హైడ్రా వ్యవస్థ ఆవశ్యకతపై

# డిప్యూటీ సీఎం పవన్ కీలక వ్యాఖ్యలు

హైడ్రా వ్యవస్థను అభినందించిన పవన్ కళ్యాణ్, ఇతర రాష్ట్రాలకు సిఫార్సు తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'హైడ్రా' వ్యవస్థ దేశంలోనే ఒక కొత్త అధ్యాయానికి నాంది పలికిందని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రశంసించారు. ప్రభుత్వ ఆస్తుల సంరక్షణ, విపత్తుల నిర్వహణ వంటి అంశాల్లో కీలకంగా వ్యవహరిస్తున్న ఈ సరికొత్త వ్యవస్థను దేశంలోని ఆంధ్రప్రదేశ్‌తో సహా అన్ని రాష్ట్రాలు అమలు చేయాల్సిన ఆవశ్యకత ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని, పాలనలో సమూల మార్పులకు దోహదపడుతుందని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. పాలకవర్గం దార్శనికత, అధికారుల నిబద్ధతే వ్యవస్థ విజయానికి మూలం ఏదైనా ఒక వ్యవస్థ విజయవంతం కావాలంటే, అది సమర్థవంతంగా పనిచేయాలంటే కేవలం కొత్త విధానాన్ని తీసుకురావడం మాత్రమే సరిపోదని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. పాలకవర్గానికి స్పష్టమైన ముందుచూపు, దానిని అమలు చేసే అధికారులకు నిబద్ధత చాలా ముఖ్య మని తెలిపారు. హైడ్రా వంటి వ్యవస్థలు మంచి పేరు, ఫలితాలను సాధించాలంటే, పారదర్శకతతో కూడిన, అంకితభావం గల అధికారుల పనితీరు కీలకంగా ఉంటుందని ఆయన నొక్కి చెప్పారు. మంగళగిరిలో హైడ్రా కమిషనర్ మర్యాదపూర్వక భేటీ ఈ సందర్భంగా, మంగళగిరిలోని తన క్యాంపు కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను 'హైడ్రా' కమిషనర్ రంగనాథ్ మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణలో హైడ్రా అమలు, అది సాధిస్తున్న ఫలితాలు, భవిష్యత్ కార్యాచరణ గురించి పవన్ కళ్యాణ్‌తో రంగనాథ్ చర్చించినట్లు తెలుస్తోంది. నూతనంగా ఏర్పడిన ఈ వ్యవస్థ పనితీరును, ప్రజల నుంచి వస్తున్న స్పందనను పవన్ కళ్యాణ్ ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. సమర్థ పాలనకు 'హైడ్రా' ఒక పార్యాంశం ప్రభుత్వ భూముల ఆక్రమణలు, జల వనరుల సంరక్షణ, విపత్తుల నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలకు 'హైడ్రా' ఒక సమర్థవంతమైన పరిష్కారాన్ని చూపిందని పవన్ కళ్యాణ్ అన్నారు. ఈ వ్యవస్థ కేవలం ఒక నిర్దిష్ట ప్రాంతానికి మాత్రమే పరిమితం కాకుండా, దేశవ్యాప్తంగా ప్రభుత్వాలు నేర్చుకోవాల్సిన ఒక పార్యాంశంగా నిలవాలని ఆకాంక్షిం చారు. ప్రజా సంక్షేమం, ప్రభుత్వ ఆస్తుల రక్షణ దిశగా తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న ఈ చర్య ఎంతో అభినందనీయమని మరోసారి తెలియజేశారు.



ట్రావెల్స్ బస్సుల్లో తనిఖీలు..

## 3 బస్సులు సీజ్


కర్నూలు జిల్లాలో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు దుర్ఘటన నేపథ్యంలో, బెంగళూరు నుంచి హైదరాబాద్ వస్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై ఆర్టీవో అధికారులు శనివారం గగన్ పహాడ్ వద్ద తనిఖీలు చేపట్టారు. అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఉపాసిని ఆధ్వర్యంలో జరిగిన ఈ తనిఖీలలో, నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న 3 బస్సులపై కేసులు నమోదు చేసి సీజ్ చేశారు. రెండు బస్సులలో స్లీపింగ్ సీట్లను స్లీపర్ సీట్లుగా మార్చడం, జగన్ ట్రావెల్స్ బస్సులో డ్యూయల్ హారన్ ఏర్పాటు చేయడం వంటి ఉల్లంఘనలు గుర్తించారు. డ్రైవర్, స్పేర్ డ్రైవర్ లతో పాటు కనీస జాగ్రత్తలు, డాక్యుమెంట్ల పరిశీలన కూడా జరిగింది. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఏఎంవిఐ ఉపాసిని హెచ్చరించారు.

## ఇందిరమ్మ రాజ్యంలో బయటపడుతున్న రోజకో అవినీతి

ఇందిరమ్మ రాజ్యంలో రోజుకో అవినీతి, పూటకో కుంభకోణం బయటపడుతున్నాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి విమర్శించారు. ఓ పని టెండర్‌కు సంబంధించి మంత్రుల మధ్య వివాదం తలెత్తితే సీఎం ఇద్దరినీ కూర్చో బెట్టి వాటాలు పంచారని ధ్వజమెత్తారు. డెక్కన్ సిమెంట్స్ కంపెనీ వారిని గన్ పెట్టి బెదిరించారని, ఇందులో సీఎం పాత్ర ఉందని మంత్రి కూతురే ఆరోపించారన్నారు. ముఖ్యమంత్రి, సీఎం పేషీ మీద వచ్చిన ఆరోపణలు ప్రజలకు తెలుసునని చెప్పారు. తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేష్, డాక్టర్ కే. సంజయ్, పార్టీ నేతలు ఆయాచితం శ్రీధర్, కే. కిషోర్ గౌడ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. మద్యం సీసాల హోలోగ్రాం కుంభకోణంలో సీఎం, మంత్రి మధ్య తలెత్తిన వివాదంలో అధికారిని బలి చేశారని మండిపడ్డారు. అవినీతి, ముడుపుల మీద మంత్రులు రోజూ కొట్లాడుకుంటున్నారని చెప్పారు. ఇందిరమ్మ రాజ్యమంటే కుంభకోణాల నిలయం, అవినీతి మయంగా మారిందన్నారు. తెలంగాణలో రోడ్లకు మహర్దశ అని మంత్రులు అంటున్నారని, రూ.27 వేల కోట్లతో రోడ్లు వేయబోతున్నామని మంత్రులు చెప్పారని, ఇందులో వేల కోట్ల కుంభకోణం ఉందని ఆరోపించారు. హ్యామ్ కాదు.. అది ఒక పెద్ద



స్కామ్ అని, రోడ్లు బాగుచేసే ముసుగులో దోపిడీకి రంగం సిద్ధమైందన్నారు.




బాత్‌రూమ్‌లో గీజర్ నుంచి గ్యాస్ లీక్..

## అక్కాచెల్లెళ్లు మృతి

కర్ణాటకలో విషాదం చోటు చేసుకుంది. బాత్‌రూమ్‌లో గీజర్ నుంచి గ్యాస్ లీకై అక్కాచెల్లెళ్లు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన మైసూరులో చోటు చేసుకుంది. బాత్‌రూమ్‌లో గ్యాస్ పీల్చి గుల్ఫామ్ (23), సిమ్రాన్ తాజ్ (20) చనిపోయారు. అక్కాచెల్లెళ్లు చాలా సేపు వాష్‌రూమ్ నుంచి బయటకి రాకపోవడంతో, వారి తండ్రి అల్తాఫ్ అనుమానం వచ్చి డోర్ బద్దలు కొట్టి చూడగా.. కుమార్తెలు అపస్మారక స్థితిలో కనిపించారు. వెంటనే వారిని ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయితే, అప్పటికే వారు చనిపోయినట్లుగా వైద్యులు నిర్ధరించారు. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. గీజర్ వాయువును విడుదల చేసిందని, కానీ మంటలు అంటుకోలేదని తెలిపారు. ఈ మేరకు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కుమార్తెల మృతితో ఆ ఇంట విషాదం నెలకొంది.



## తెలంగాణలో ఇంటర్ పరీక్షల తేదీ ఖరారు



తెలంగాణలో ఇంటర్-2025 పరీక్షల తేదీ ఖరారు అయ్యాయి. ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు ఇంటర్ పరీక్షలు జరగనున్నట్లు ఇంటర్మీడియట్ బోర్డు ప్రకటించింది. ఇంటర్ సిలబస్‌లోనూ మార్పులు చేసింది. ఈ నిర్ణయంతో ఫస్ట్ ఇయర్‌లో కూడా ల్యాబ్స్, ప్రాక్టికల్ ఎగ్జామ్స్ ఉండనున్నాయి. ఇంటర్మీడియట్ పరీక్షల తేదీలతో పాటు ప్రాక్టికల్స్, పరీక్షల్లో చేస్తున్న మార్పులపై ఇంటర్ బోర్డు సెక్రటరీ కృష్ణ ఆదిత్య మీడియా సమావేశం నిర్వహించారు. ఈ మేరకు పలు వివరాలను వెల్లడించారు. ఈ విద్యాసంవత్సరంలో రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 9 లక్షల 50 వేల మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. పరీక్షల షెడ్యూల్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన తరుణంలో ఇవాళ (శనివారం) ఇంటర్ బోర్డు మీడియా సమావేశం నిర్వహించింది.ఫిబ్రవరిలో జరిగే ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలను ప్రభుత్వ కళాశాలల్లోనే నిర్వహించేలా బోర్డు చర్యలు తీసుకుంటుంది. ప్రభుత్వ సెక్టార్ కాలేజీలను ప్రాక్టికల్ సెంటర్లను మినహాయించాలని నిర్ణయించింది. దీనికి అనుగుణంగానే ప్రాక్టికల్స్ షెడ్యూల్‌ను సిద్ధం చేసింది. పిల్లల్లో పరీక్షల భయాన్నిపాగొట్టేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రతియేటా ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు సుమారు 4.20 లక్షలకు పైగా విద్యార్థులు హాజరవుతున్న సంగతి తెలిసిందే.

## రకుల్ ప్రీత్ సింగ్ హాట్ లుక్స్

హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్. పాన్ ఇండియా సినీప్రియులకు ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేని పేరు. ఈరోజు ఈ ముద్దుగుమ్మ 35వ పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆమెకు అభిమానులు, సినీతారలు సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. ఒకప్పుడు తెలుగులో వరుసగా బ్లాక్ బస్టర్ హిట్స్ అందుకున్న రకుల్.. ఇప్పుడు మాత్రం సినిమాలకు దూరంగా ఉంటుంది. అయితే కెరీర్ ఫాంలో ఉండగానే రకుల్ నిర్మాత జాకీ భగ్నానీతో ప్రేమలో పడింది. కొన్నాళ్లపాటు ప్రేమలో ఉన్న వీరిద్దరు 204 ఫిబ్రవరి 21న పెళ్లి చేసుకున్నారు. రకుల్ ఇప్పుడు ఎక్కువగా హిందీలో నటిస్తుంది. ఇటీవలే ఆమె దే దే ప్యార్ దే 2 చిత్రంలో నటించింది. ఆయేషా ఖురానా పాత్రలో కనిపించనుంది. ఇందులో అజయ్ దేవగన్, ఆర్. మాధవన్, టబు కీలకపాత్రలు పోషించగా.. నవంబర్ 14న రిలీజ్ కానుంది. చాలా కాలంగా తెలుగు సినిమాలకు దూరంగా ఉంటుంది రకుల్. కానీ సోషల్ మీడియాలో మాత్రం చాలా యాక్టివ్ గా ఉంటుంది. నిత్యం ఏదోక పోస్ట్ చేస్తూ సందడి చేస్తుంది. తాజాగా ఈ ముద్దగుమ్మ షేర్ చేసిన ఫోటోస్ తెగ వైరలవుతున్నాయి.

డివైడర్‌ను ఢీకొట్టి.. పాదచారులపై దూసుకెళ్లిన కారు..

## అయిదుగురు మృతి

ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలో ఘోర రోడ్డుప్రమాదం జరిగింది. ఓ కారు అతి వేగంగా దూసుకొచ్చి.. డివైడర్‌ను ఢీకొట్టి. ఆ తర్వాత పాదచారులపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో అయిదుగురు మృతిచెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. క్రిటికల్‌గా గాయపడిన వారిని సరోజిని నాయుడు మెడికల్ కాలేజీలో చేర్చినట్లు ఏసీపీ శేషమణి ఉపాధ్యాయ తెలిపారు. ఆగ్రాలోని నాగ్లాబుధి వద్ద ఈ దుర్ఘటన జరిగింది. మృతిచెందినవారిని బబ్లీ, భాను ప్రతాప్, కమల్, కృష్ణ, బంటేశ్‌గా గుర్తించారు. భాను ప్రతాప్ అనే వ్యక్తి ఓ ప్రైవేటు కంపెనీలో పార్సిల్ డెలివరీ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు.

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM

# కియారా అద్వానీకి అయిదో షాక్

అందం, హిట్లు రెండు ఉన్న లక్కీ హీరోయిన్ గా మొన్నటిదాకా మంచి ఊపు మీదున్న కియారా అద్వానీకి బాక్సాఫీస్ వద్ద వరస షాకులు తగులుతున్నాయి. ఒకటి రెండు ఏకంగా అయిదు ఫ్లాపులు క్యూ కట్టడంతో పారితోషికం పరంగా నెలకొన్న డిమాండ్ క్రమంగా తగ్గిపోయేలా ఉంది. చివరి సక్సెస్ తనకు 2022లో 'భూల్ భులయ్యా 2'తో దక్కింది. దాని విజయంలో హీరో కార్తీక్ ఆర్యన్ దే ప్రధాన పాత్ర అయినప్పటికీ కియారాకు కూడా పేరు తీసుకొచ్చింది. ఆ తర్వాత కామెడీ ఎంటర్ టైనర్ 'జగ్ జగ్ జియో' అంతంతమాత్రంగానే ఆడింది. ఎన్నో వాయిదాలు పడుతూ వచ్చిన విక్కీ కౌశల్ 'గోవిందా మేరా నామ్' ఫలితం కూడా సోసోనే.ఇటీవలే తల్లి హోదాలోకి ప్రవేశించిన కియారా అద్వానీ కొంత గ్యాప్ తీసుకుని కెరీర్ మీద మళ్ళీ ఫోకస్ పెంచబోతోంది. గ్లామర్ షోకు ఏ మాత్రం మొహమాటపడనని వార్ 2 లో చెప్పేసింది కనక ఆ కోణంలో వాడుకునేందుకు దర్శకులు రెడీ అవుతున్నారు. కెరీర్ ప్రారంభంలో భరత్ అనే నేను, కబీర్ సింగ్, ఎంఎస్ ధోని లాంటి వరస సక్సెస్ లు చూశాక ఇప్పుడిలా ఫ్లాపులు రావడం ఫ్యాన్స్ ని కలవరపెడుతోంది. విచిత్రం ఏంటంటే వార్ 2లో ఇద్దరు పెద్ద హీరోలున్నా హీరోయిన్ కం ప్రధానంగా కనిపించే లేడీ క్యారెక్టర్ కియారా అద్వానీ ఒక్కటే. అయినా కూడా ఫలితం దక్కపోవడం బ్యాడ్ లక్ కాక ఇంకేమిటి.



## నిరుద్యోగ నిరసన రాజకీయం..

# కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం

తెలంగాణలో ఉద్యోగాల భర్తీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై నిరుద్యోగ జాయింట్ యాక్షన్ కమిటీ (JAC) తీవ్ర స్థాయిలో విమర్శలు చేసింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు 2 లక్షల ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేసింది. ఈ ఆందోళనకు మద్దతుగా హైదరాబాద్‌లోని జలవిహార్‌లో బీఆర్ఎస్ (BRS) నేత హరీశ్ రావు 'నిరుద్యోగ బాకీ కార్డు'ను ఆవిష్కరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను మోసగించిందని, హామీలను నెరవేర్చడంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని విధాలుగా విఫలమయ్యారని ఆయన దుయ్యబట్టారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలపై ప్రభుత్వానికి బాధ్యత గుర్తుచేసేందుకు బీఆర్ఎస్ నాయకత్వం 'నిరుద్యోగ బాకీ కార్డు'ను రాజకీయ అస్త్రంగా వాడుతోంది. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగుల ఉద్వేగాలతో ఆడుకుంటోందని, నియామకాల విషయంలో కొత్త నోటిఫికేషన్లు ఇవ్వడంలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో నిరుద్యోగుల సమస్యలు మరింత పెరిగాయని, తక్షణమే తమ ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. మరోవైపు, నిరుద్యోగుల ఆందోళనలను బీఆర్ఎస్ రాజకీయం చేస్తోందని కాంగ్రెస్ నేతలు తీవ్రంగా ఖండించారు. ప్రతిపక్షం కేవలం తమ రాజకీయ ప్రయోజనాల కోసమే నిరుద్యోగులను రెచ్చగొడుతోందని ఆరోపించారు. నిరుద్యోగులు బీఆర్ఎస్ ట్రాప్‌లో పడకుండా, ప్రభుత్వ భర్తీ ప్రక్రియపై విశ్వాసం ఉంచాలని కాంగ్రెస్ నేతలు సూచిస్తున్నారు. త్వరలోనే అన్ని హామీలను నెరవేర్చి, పారదర్శకంగా ఉద్యోగాల భర్తీ చేపడతామని వారు



పునరుద్ఘాటించారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ విషయంలో ప్రధాన పార్టీల మధ్య మాటల యుద్ధం నడుస్తుండగా, నిరుద్యోగుల్లో మాత్రం ఆందోళన, అసంతృప్తి పెరుగుతున్నాయి. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు త్వరగా నెరవేరకపోవడంతో, జాబ్ క్యాలెండర్, మెగా డీఎస్సీ వంటి కీలక అంశాలపై ప్రభుత్వం నుండి స్పష్టత కోరుతున్నారు. బీఆర్ఎస్ చేస్తున్న విమర్శలు, కాంగ్రెస్ ఇస్తున్న హామీల నడుమ, నిరుద్యోగ యువత తమ భవిష్యత్తుపై ఆందోళన చెందుతూ, సమస్య త్వరితగతిన పరిష్కారం కావాలని ఎదురుచూస్తున్నారు.




## తెలంగాణలో మూడు రోజుల పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వానలు..

### 17 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ

తెలంగాణ రాష్ట్రంలో రాబోయే మూడు రోజుల పాటు వాతావరణం ఉరుములు, మెరుపులు మరియు ఈదురు గాలులతో కూడిన వర్షాలతో కూడి ఉంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం శుక్రవారం వెల్లడించింది. దీనికి అనుగుణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా వ్యవసాయదారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ సూచించింది. పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. ముఖ్యంగా ఈ రోజు, రాష్ట్రంలోని 17 జిల్లాలకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం 'ఎల్లో అలర్ట్' జారీ చేసింది. ఈ హెచ్చరిక పరిధిలోని జిల్లాలలో ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మరియు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలు ఉన్నాయి. ఈ ప్రాంతాల ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రాకపోవడం మంచిది. ఎల్లో అలర్ట్ జారీ చేసిన జిల్లాలతో పాటు, రాష్ట్రంలోని మిగతా ప్రాంతాలలో కూడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. ఈ అకాల వర్షాల వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడం, లోతట్టు ప్రాంతాలు జలమయం కావడం, పంటలకు నష్టం వాటిల్లడం వంటి సంఘటనలు సంభవించే అవకాశం ఉంది. కావున, ప్రభుత్వ యంత్రాంగం కూడా తగిన సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ప్రజలు ఈ వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకుని అత్యవసర పనులు ఉంటేనే బయటకు వెళ్లాలని, విద్యుత్ స్తంభాలు, పాత భవనాల కింద ఉండకుండా జాగ్రత్త వహించాలని అధికారులు కోరుతున్నారు. వాహనదారులు కూడా తక్కువ వేగంతో ప్రయాణించాలని, వర్షం కారణంగా రోడ్లపై ఏర్పడే నీటి గుంతల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మూడు రోజుల పాటు ఈ వాతావరణ పరిస్థితి కొనసాగే అవకాశం ఉన్నందున, అందరూ సురక్షితంగా ఉండాలని వాతావరణ కేంద్రం పునరుద్ఘాటించింది.

## మూసాపేట డిపోలో రసాయన విభాగంలో భారీ అగ్నిప్రమాదం.. ఆస్తి నష్టం అపారంగా!

హైదరాబాద్ మహానగరం మూసాపేట ప్రాంతం శనివారం ఉదయం అగ్ని ప్రమాదంతో ఉలిక్కిపడింది. గూడ్స్ షెడ్ రోడ్డులోని ఇండియన్ కంటైనర్స్ కార్పొరేషన్ డిపోలో భారీ అగ్నికీలలు ఎగసిపడ్డాయి. ఈ ప్రమాదం డిపోలోని రసాయన విభాగంలో మొదలైనట్లుగా ప్రాథమిక సమాచారం. మంటలు వేగంగా వ్యాపించడంతో ఆ ప్రాంతమంతా దట్టమైన నల్లటి పొగలు అలముకున్నాయి. ఈ కారణంగా చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మంటల తీవ్రతకు కారణం రసాయనాలతో పాటు, గోదాములో నిల్వ ఉంచిన ఇతర దహనమయ్యే పదార్థాలు కూడా కావచ్చని అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా, కొన్ని నివేదికల ప్రకారం, డిపోలోని లిక్కర్ నిల్వ ఉంచిన ప్రాంతానికి మంటలు వ్యాపించడంతో ఆస్తి నష్టం మరింత అధికంగా ఉంది. కోట్ల రూపాయల విలువైన సరుకు, కంటైనర్లు అగ్నికి ఆహుతైనట్లుగా డిపో అధికారులు తెలిపారు. అయితే, ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడం ఊరటనిచ్చే అంశం. ఘటన గురించి సమాచారం అందిన వెంటనే, పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మంటలను అదుపులోకి తీసుకురావడానికి ఆరుకు పైగా ఫైరింజన్లు రంగంలోకి దిగాయి. అగ్నిమాపక సిబ్బంది అనేక గంటల పాటు శ్రమించి, మంటలు ఇతర విభాగాలకు, ముఖ్యంగా జనవాస ప్రాంతాలకు వ్యాపించకుండా నియంత్రించగలిగారు. డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ బృందాలు కూడా సహాయక చర్యల్లో పాలుపంచుకున్నాయి. భారీ అగ్నిప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. షార్ట్ సర్క్యూట్ లేదా రసాయనాలలో చోటు చేసుకున్న ఏదైనా చర్య ప్రమాదానికి దారితీసి ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు.



## టోన్డ్ ఫిజిక్ లో శర్వానంద్

టాలీవుడ్ నటుడు శర్వానంద్ త్వరలో బైకర్ మరియు నారీ నారీ నడుమ మురారి రెండు బ్యాక్ టు బ్యాక్ రిలీజ్ లతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నాడు. బైకర్ అనేది స్పోర్ట్స్ డ్రామా అయితే నారీ నారీ నడుమ మురారి పూర్తి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ బిజీ దశలో, శర్వానంద్ ఇటీవల కొత్త ఫోటోషూట్ చేయించుకున్నాడు మరియు ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మోనోక్రోమ్ షాట్‌లలో నటుడు చొక్కా లేని అవతార్‌లో కనిపిస్తాడు. ఇండోర్ సెట్టింగ్‌లో ఆత్మవిశ్వాసంతో కూడిన భంగిమలో ఉన్నాడు. అతని టోన్డ్ ఫిజిక్ మరియు అబ్స్‌ను ప్రదర్శిస్తాడు. ఈ చిత్రాలు నెటిజన్లలో ఉత్సుకతను రేకెత్తించాయి. వారు నటుడి ఆకస్మిక పరివర్తన ఏదైనా సినిమా కోసం అని ఆలోచిస్తున్నారు. బైకర్, నారీ నారీ నడుమ మురారి చిత్రాలతో పాటు శర్వానంద్‌కి సంపత్ నంది దర్శకత్వం వహించిన భోగి కూడా లైన్‌లో ఉంది.

## ఛావా రికార్డ్ బ్రేక్ చేసిన రిషబ్ శెట్టి

రిషబ్ శెట్టి నటించిన కాంతారా ఎ లెజెండ్: చాప్టర్ 1 ఇప్పుడు థియేటర్లలో దూసుకుపోతుంది. ఈ ఏడాదిలో అతిపెద్ద సినిమా విజయాలలో ఒకటిగా నిలిచింది. ఈ పౌరాణిక యాక్షన్ థ్రిల్లర్ దేశవ్యాప్తంగా ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంది. ఈ సినిమాలో అద్భుతమైన విజువల్స్, బీజీఎమ్, నటీనటుల యాక్షన్ ప్రేక్షకులను కట్టిపడేశాయి.ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ వద్ద, కాంతారా చాప్టర్ 1 ఇప్పుడు రూ. 818 కోట్లు దాటింది. విక్కీ కౌశల్, రష్మిక మందన్నా నటించిన ఛావా సినిమా మొత్తం రూ. 807 కోట్లను రాబట్టగా.. ఇప్పుడు కాంతార రూ.818 కోట్లు రాబట్టి ఛావా సినిమాను అధిగమించింది. అక్టోబర్ 24, 2025న భారతదేశంలోనే రూ. 38 కోట్ల వసూళ్లను వసూలు చేసింది. కేవలం రెండు వారాల్లోనేఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా రూ. 717 కోట్లు సంపాదించింది. ఇప్పుడు 2025లో అత్యధిక వసూళ్లు చేసిన భారతీయ చిత్రాలలో ఒకటిగా నిలిచింది కాంతార చాప్టర్ 1. చావా సినిమా భారీ విజయాన్ని అందుకుంది. ఇక ఇప్పుడు కాంతార చాప్టర్ 1 కన్నడ, హిందీ, తమిళం, తెలుగు వెర్షన్‌లతో సహా అన్ని భాషలలో కలెక్షన్లలో సత్తా చాటుతుంది.

